క్లుప్తంగా

వైద్య సేవలపై ఆరా



కాయకల్ప బృందానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 'కాయకల్ప' బృందం సోమవారం పరిశీలించింది. వైద్య సేవలు, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలు వంటి వాటిని పరిశీలించి ఉత్తమంగా ఉన్న ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుంది. దీంట్లో భాగంగా నరసన్నపేట ఆస్పత్రికి కాయకల్ప బృందం ప్రతినిధి రవికుమార్ ఆధ్వర్యంలో వచ్చి పరిశీలించింది. ఆపరేషన్ గది, రోగులు అందుతున్న సేవలపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రసూతి విభాగంలో రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ ఏపీవీ రమణమూర్తి తదితరులు ఉన్నారు.

పెన్నుల పంపిణీ



హిరమండలం హైస్కూల్‌లో పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: వచ్చే నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు సారువకోట మండలం వాండ్రాయి గ్రామానికి చెందిన డీఎస్పీ దేవాది కృష్ణరావు సమకూర్చిన పెన్నులను బాసర సరస్వతీ దేవి ఆలయంలో పూజలు చేయించారు. వీటిని సోమవారం మండలంలోని హిరమండలం, భగీరథిపురం, తంప, అవలంగి, గులుమూరు తదితర ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ కె.రాంబాబు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో పదో తరగతి చదువుతున్న సుమారు 2,500 మందికి పెన్నులు అందించినట్లు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి



జమ్ములో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

నరసన్నపేట: పంట భూముల్లో లేఅవుట్లు వేస్తే కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని జమ్ము గ్రామంలో నరసన్నపేటకు చెందిన వ్యక్తి లేఅవుట్ వేస్తుండగా సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాలా చెల్లించాలని, సుడా అనుమతితో లేఅవుట్ వేయాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. నిబంనధల మేరకు నాలా కట్టించుకుంటున్నామని తెలిపారు. మండల సర్వేయర్ అప్పలస్వామి, తదితరులు ఉన్నారు.

నాణ్యత పాటించాలి



నాణ్యతను పరిశీలిస్తున్న అర్అండ్‌బీ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ సుధాకర్

పాతపట్నం: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆర్ అండ్‌బీ సీఈ (విజయవాడ) ఎల్.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. పాతపట్నం నుంచి మెళియాపుట్టి రోడ్డు (ఆల్ ఆంధ్ర రోడ్డు) 13.08 కిలో మీటర్ల మేర రూ.56 లక్షల నిధులతో చేపట్టిన మరమ్మతులను సోమవారం పరిశీలించారు. సూర్యనారాయణపురం రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలించి, మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎస్ఈ కె.వి.సుధాకర్, ఈఈ పి.నాయక్, డీఈఈ సత్యనారాయణ, జేఈ యోగి ఉన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఆమదాలవలస: పట్టణంలోని మూడో వార్డు ఊసవానిపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ మేరకు ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డు, శ్రీకాకుళ రూరల్ మండలానికి చెందిన తురకపేట గ్రామస్తుడు అల్లు శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఊసవానిపేటలోని దుర్గాదేవి ఆలయం వద్ద రాత్రి 8 గంటల సమయంలో శ్రీనివాసారవు తన ద్విచక్ర వాహనం నిలుపుదల చేశారు. 21వ తేదీ రాత్రి రెండు గంటల సమయంలో వెళ్లి చూసేసరికి బైక్ కనిపించలేదు. పలుచోట్ల గాలించినప్పటికీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు బేఖాతరు!

- ఆ భవనాలకు అనుమతి అక్కర్లేదా?
- పార్కింగ్ లేకుండా కన్వెన్షన్ నిర్వహణ..
- పట్టించుకోని అధికారులు



పోలీస్ స్టేషన్ సమీపంలో పార్కింగ్ స్థలం కూడా లేకుండా నిర్మించిన కన్వెన్షన్ హాల్

ఆమదాలవలస: పట్టణంలో అనధికారిక నిర్మాణాలు రోజు, రోజుకూ పెరుగుతున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో ఒక ప్రముఖ బిల్డర్ ఎటువంటి అనుమతుల్లేకుండా కన్వెన్షన్ హాల్ నిర్మాణం చేస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కనెత్తి కూడా చూడటం లేదు. రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ అధికారి ఆమదాలవలస మున్సిపాలిటీ నుంచి బదిలీపై వెళ్లిపోయారు. కొద్దిరోజులపాటు సచివాలయ కార్యదర్శికి అదనపు బాధ్యత అప్పగించారు. ప్రస్తుతం ఆమదాలవలస మున్సిపాలిటీలో మూడు రోజులు, పలాస మున్సిపాలిటీలో మూడురోజులపాటు టీపీఓ విధులు చేపడుతున్నారు. దీంతో మున్సిపాలిటీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నట్లు సమాచారం.

65 అనధికార నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఆమదాలవలస పట్టణంలో 65 అనధికార నిర్మాణాలను మున్సిపల్ సిబ్బంది గుర్తించారు. వారికి నోటీసులు కూడా అందజేశారు. స్థానిక అధికార పార్టీ నాయకులు, బిల్డర్లకు మునిసిపల్ సిబ్బంది పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ కల్యాణ మండపానికి కనీస బిల్డింగ్ బైలాస్ పాటించలేదు, సెట్ బ్యాక్‌లు విడిచిపెట్టలేదు. కేవలం ఫుట్ పాత్ పోర్టుకో మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణం చేపట్టిన బిల్డర్‌కు కొంతమంది అధికారులు, టీడీపీ నాయకులు దగ్గరుండి సహకరించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో పలుచోట్ల అనుమతుల్లేని నిర్మాణాలు చేపడుతున్నా.. అటువంటి వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందినట్లు తెలుస్తుంది. ఈ నిర్మాణాలకు కమర్షియల్ పర్పస్‌తో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేట్టి.. కొంత మొత్తాన్ని మున్సిపల్, విద్యుత్ శాఖ, ఇతరశాఖల అధికారులకు బిల్డర్లు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భవనాల వద్ద కనీసం వాహనాలు నిలిపేందుకు కూడా స్థలం ఉండటం లేదు.

అధిక మొత్తంలో వసూళ్లు..!

ఆమదాలవలస పట్టణ ప్రధాన రహదారిలో పలు అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ యజమానుల నుంచి కొంత మొత్తంలో వసూలు చేసి, శిస్తుల పేరిట అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది బిల్డర్లకు మున్సిపల్ అధికారులు ఇటీవల హడావిడిగా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నోటీసులు భవన నిర్మాణ యజమానులకు చేరిన దాఖలాలు లేవని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఫుట్ పాత్ ఆక్రమణలు కూడా తొలగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



ఆమదాలవలస పట్టణంలో నిర్మిస్తున్న అనధికార నిర్మాణాల్లో తమ దృష్టికి వచ్చిన వాటికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. అటువంటి వాటిపై చర్యలు చేపడతాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే అపరాధ రుసుం విధించేలా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలో ఇళ్లు కట్టుకోవాలనుకునే వారు ముందుగా ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలి.

– పి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



నికేష్ నాయుడుతో కోచ్ లక్ష్మణనాయుడు

ఆమదాలవలస: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని మూడో వార్డు ఊసవానిపేటకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ వెపన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన పి.నికేష్ నాయుడు బంగారు పతకం, శ్రీవాణి హైస్కూల్‌కు చెందిన బి.హేమసాయి కాంస్య పతకం సాధించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి నలుగురు పతకాలు సాధించారు. వారిలో ఇద్దరు ఆమదాలవలస పట్టణానికి చెందిన వారు కావడం విశేషం. నికేష్ నాయుడును, కోచ్ నక్క లక్ష్మణనాయుడును సోమవారం సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వందన అభినందించారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని మాఘ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా సోమవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఏకవార ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు హారుతులిచ్చారు. అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్షణ కరువు..



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని చెవ్వాకులపేట పేట బ్రిడ్జి. సరుబుజ్జిలి మండలంలోని ఆర్అండ్‌బీ రహదారిలో పలుచోట్ల బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. రక్షణ గోడలు సక్రమంగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాడైన బ్రిడ్జీలు ఉన్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడంలేదు. ప్రధానంగా ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట, సరుబుజ్జిలి మండలం నవలాపురం జంక్షన్, ఏఎల్‌నగరం, కొత్తకోట ప్రదేశాలు వద్ద బ్రిడ్జీలు పూర్తిగా పాడయ్యాయి. అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - సరుబుజ్జిలి

కాలనీ స్థలాలు విక్రయిస్తే చర్యలు



ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీ స్థలాలను ఎవరైనా విక్రయించినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని సరుబుజ్జిలి తహసీల్దార్ ఎల్.మధుసూదన హెచ్చరించారు. సరుబుజ్జిలి మండల కేంద్రానికి సమీపంలో ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీ స్థలాల్లో లబ్ధిదారులు కాకుండా వేరొక వ్యక్తులు నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం వెళ్లి పరిశీలించారు. లబ్ధిదారులు పేరిట ఉన్న స్థలాలను వేరొకరికి విక్రయాలు చేయడం చట్ట రీత్యానేరమన్నారు. ఎవరైనా కొనుగోలు చేసినట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత వ్యక్తులు ఇబ్బందులకు గురికాకతప్పదని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. - సరుబుజ్జిలి

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శివరాత్రి నేపథ్యంలో జలుమూరు మండలంలోని శ్రీముఖలింగంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఆలయ పరిసరాలు, వీధుల్లో చెత్త, వ్యర్థాలు తొలగించారు. మురుగు కాలవలను శుభ్రం చేసినట్లు డీఎల్‌పీ ఐ.వి.రమణ సోమవారం తెలిపారు. దీని కోసం శ్రీకాకుళం, ఆమదాలువలస మున్సిపాల్టీల నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను నియమించామన్నారు. - జలుమూరు

ఇంటర్ ప్రశ్నపత్రాలు భద్రం



నరసన్నపేట మండలంలో మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం భద్రపరిచారు. నరసన్నపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పద్మావతి, సంపత్‌సాయి, జ్ఞాన జ్యోతి, శాంతా జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు మంజూరు చేశారు. 2,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. - నరసన్నపేట

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నరసన్నపేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ



పొందూరు: పార్కు స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ

నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ సోమవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని పరిశీలించిన అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. పోలింగ్‌కు వీలుగా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకూ ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నరసన్నపేటలో 200 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రశాంతంగా పోలింగ్ జరిపేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పొందూరులో..

పొందూరు: పొందూరులోని పార్కు స్కూల్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ర్యాంపు, పోలింగ్ కేంద్రంలో తదితర సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఓటర్ల వివరాలను సేకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణలో ఎన్నికలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

శైవక్షేత్రాలు ముస్తాబు

ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న శివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు, పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాల అలంకరణతో ధగధగలాడుతున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. పలు ఆలయాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాల పంపిణీకి, అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



సారవకోట: మండలాధీశ్వర స్వామి ఆలయం



కొత్తూరు: సిరువాడ శివాలయంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం



జలుమూరు: శ్రీముఖలింగంలో సిద్ధం చేసిన బారికేడ్లు



హిరమండలం: ఉమారుద్ర కోటేశ్వరాలయం



బూర్జ: పురాతనమైన శివాలయాన్ని శుభ్రం చేస్తున్న భక్తులు



నరసన్నపేట: కలివరపుపేటలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన షిర్డీ సాయి ఆలయం



పాతపట్నం: నీలకంఠేశ్వరుడి ఆలయంలో ఆలయాల సముదాయం

చింతాడను అడ్డుకోవడం దారుణం



ఖండాపు గోవిందరావు

బూర్జ: పొందూరు మండలంలోని బొడ్డేపల్లి, ఆమదాలవలస మండలంలోని నెల్లిమెట్ట గ్రామాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ ర్యాంప్‌లను ఆదివారం పరిశీలించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను టీడీపీ గుండాలు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అన్నారు. సోమవారం మదనాపురంలో విలేకర్లతో మాట్లాడారు. ఇలాంటి దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చవకబారు రాజకీయాలకు కేరాఫ్ అడ్రాస్‌గా టీడీపీ మారిందని దుయ్యబట్టారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

'కుప్పిలి'కి అంతర్జాతీయ గుర్తింపు



కె.వి.రాజారావు మాస్టారు

ఆమదాలవలస: కాలిఫోర్నియా నుంచి వెలువడిన అంతర్జాతీయ కవితా సంకలనంలో ఆమదాలవలస పట్టణానికి చెందిన కుప్పిలి వెంకట రాజారావు (మాస్టారు) కవితకు స్థానం లభించింది. వీక్షణం సంచికలో 150 ఉత్తమ కవితలతో రచించిన 'పతన సమాధిపై' కవిత, కళా తపస్వి కె.విశ్వనాథ్ కళాత్మక చిత్రాలపై గ్రంథం రచిస్తున్నట్లు రాజారావు సోమవారం తెలిపారు.

రూ.6 లక్షల విరాళం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల జగన్నాథస్వామి ఆలయంలో రథం తయారీ కోసం పాతపట్నం నియోజకవర్గం జనసేన నాయకురాలు కొరికాన భవాని, ఆమె భర్త శ్రీకాకుళం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ రూ.6 లక్షల విరాళాన్ని సోమవారం అందించారు. రథం తయారీ కోసం అవసరమయ్యే సామగ్రిని ఆలయం వద్దకు పంపించారు. ఆలయ ప్రాంగణంలోనే గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుల పర్యవేక్షణలో రథం తయారీ పనులు పూర్తి చేయాలని సూచించారు. స్థానిక జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

సారవకోట: ఈ నెల 28వ తేదీన మండలంలోని మదనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎం.వి.రమణ సోమవారం తెలిపారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 27వ తేదీలోగా హెచ్ఎం ఫోన్ 9652219443కు సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు (నగదు) అందజేస్తామన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జలుమూరు: మండలంలోని కొమనాపల్లి గ్రామానికి చెందిన కనుసు కుమారిపై అత్తమామలు అప్పల నరసమ్మ, అప్పారావు, మరిది రాజు దుర్భాషలాడి తీవ్రంగా కొట్టారని సోమవారం జలుమూరు పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. భాదితురాలు కుమారి తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త జగదీశ్వరరావు బయటకు వెళ్లిన సమయం చూసి నిత్యం వేధిస్తున్నారన్నారు. పెళ్లి అయి 16 ఏళ్లు అయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. కనీసం ఇంటిలో గౌరవం లేకుండా నిత్యం వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నానని ఆమె తెలిపింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది.

సంక్షిప్తంగా..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

సరుబుజ్జిలి: యోగాసాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా ప్రముఖ్ జగదీశ్వరరావు తెలిపారు. రొట్టవలస రామానందాశ్రమం ఆవరణలో సోమవారం యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమం వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామి, మానసిక వైద్యులు సనపల లక్ష్మణరావు పాల్గొన్నారు.

అటవీ సంపదను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ ఈశ్వరరావు

సారవకోట: అడవులు, అటవీ సంపదను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అటవీశాఖ సారవకోట సెక్షన్ అధికారి ఎల్.ఈశ్వరరావు సూచించారు. సోమవారం సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించారు. రైవాడ సమీపంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌కి 6 నుంచి 9వ తరగతి చదువుతున్న పలువురు విద్యార్థులను తీసుకెళ్లారు. అక్కడి వాతావరణం, వివిధ రకాల మొక్కలు, పలు రకాల జంతువుల గూర్చి వివరించారు. బీట్ అధికారి శివప్రసాద్ ఉన్నారు.

పరీక్షలపై భయం వీడాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: పరీక్షలపై భయం వీడాలని, అవసరమైన ప్రణాళికలు ఇప్పటినుంచే తయారుచేసుకోవాలని పాతపట్నం సీఐ రామారావు అన్నారు. సోమవారం చాపర జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలు, ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఎంఈఓ దేవేంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహన్, ఎస్ఐ రమేష్ బాబు ఉన్నారు.

ఏకాగ్రత ముఖ్యం..



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

సరుబుజ్జిలి: చదువు పట్ల ఏకాగ్రత చూపితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రొట్టవలస హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కత్తిరి రామకృష్ణారావు తెలిపారు. సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు స్టేషనరీ అందించారు. స్థానిక పెద్దలు మూడడ్ల రమణ, కుసుమంచి హరీస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రమ శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండలంలోని నివగాం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆదినారాయణ, నివగాం ఉన్నత పాఠశాల హెచ్ఎం సువ్వారి నిర్మల అన్నారు. జూనియర్ కాలేజీలో ఫేర్‌వేల్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. జానపద, సినీ గీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ టంకాల రమణారావు, బి.సంజీవ రావు పాల్గొన్నారు.

విజయగౌరీకి మద్దతుగా నిలవండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత ప్రకాష్‌రావు

కొత్తూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కె.విజయగౌరీకి మద్దతుగా నిలవాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్‌రావు కోరారు. మండలంలోని మెట్టూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న విజయగౌరీని గెలిపించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు జి.మాధవరావు, విజయ కుమార్, కొండలరావు, భద్రయ్య, దినేష్, ప్రజా సంఘాల నాయకుడు సిర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.